క్లుప్తంగా

క్షేత్రపాలకుడికి ఆకుపూజ



ఆంజనేయస్వామికి ఆకుపూజ నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనరసింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి అర్చకులు, భక్తులు మంగళవారం తమలపాకుల పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ఆరాధన, పంచామృతాభిషేకం, గంధసిందూరం, పండ్లు, పానకాలు అలంకరణతో పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గండు సైదులు, ఈఓ లక్ష్మణ్‌రావు, శ్రీనాథ్, విశ్వనాథ్, వెంకటేశ్వర్లు, పూర్ణా, సక్కుబాయమ్మ, అర్చకులు హరీష్‌కుమారాచార్యులు, శ్రీనివాసాచారి, తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

చిలుకూరు : త్వరలో జరగనున్న ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ కరుణశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 01- 11- 2020 కంటే ముందు పట్టభద్రులైన వారు ఫారం- 18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డిగ్రీ లేదా డిప్లొమా సర్టిఫికెట్లు, ఆధార్, ఓటర్ కార్డుల జిరాక్స్‌లు, ఫోన్ నంబర్ జత చేసిన దరఖాస్తులను ఫిబ్రవరి 6వ తేదీలోగా అందజేయాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏఎస్‌ఐ కృష్ణమూర్తి

మునగాల : సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని మునగాల ఏఎస్‌ఐ కృష్ణమూర్తి తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం మునగాల మండలంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలలో సైబర్ నేరాలు, సోషల్ మీడియా, డ్రగ్స్, మత్తు మందులు, గంజాయి నిషేధంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓటీపీ ఫ్రాడ్స్, టోల్‌ఫ్రీ నంబర్ 1930, సెల్‌ఫోన్ల వల్ల కలిగే అనర్థాలు, షీటీమ్స్, మహిళల భద్రత, పిల్లలపైన సోషల్ మీడియా ప్రభావం, విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆట పాటల ద్వారా పోలీస్ కళాజాతా సిబ్బంది విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మద్దూరి సాయిఈశ్వరి, హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణరెడ్డి, సిబ్బంది నిరంజన్, ఉపాధ్యాయులు, పోలీసు కళాబృందం ఇన్‌చార్జి యల్లయ్య, సభ్యులు గోపయ్య, చారి, నాగార్జున, కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

సాగర్ నీటిని విడుదల చేయాలి

నడిగూడెం : సాగర్ నీటిని విడుదల చేయాలని రైతు సంఘం నాయకుడు ఏనుగుల వీరాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని రామాపురంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆయకట్టు గ్రామాల్లో వేలాది ఎకరాల్లో బోర్లు, బావుల కింద రైతులు వరి సాగు చేపట్టారని తెలిపారు. భూగర్భ జలాలు తగ్గడంతో నీటి కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం స్పందించి నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే లక్ష్యం



జన విజ్ఞాన వేదిక పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ ప్రశాంతి తదితరులు

చిలుకూరు : విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి, సమాజంలో మూఢ నమ్మకాలను రూపుమాపడమే జన విజ్ఞాన వేదిక లక్ష్యమని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు చందా శ్రీనివాస్ అన్నారు. మంగళవారం చిలుకూరు మండలంలోని చెన్నారిగూడెం గ్రామంలో జన విజ్ఞాన వేదిక పోస్టర్‌ను ఎంపీపీ బండ్ల ప్రశాంతి కోటయ్యతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న మండల స్థాయిలో చిలుకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో జన విజ్ఞాన వేదిక టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎంపీపీ బండ్ల ప్రశాంతి మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే టాలెంట్ టెస్ట్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు జాఫర్, హెచ్‌ఎమ్‌లు జనార్దన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా లోపం.. రోడ్డు ధ్వంసం

- తొగర్రాయి- కూచిపూడి రోడ్డు నిర్మించి ఆరు నెలలు
- పలుచోట్ల ధ్వంసమైన రహదారి
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



ధ్వంసమైన తొగర్రాయి - కూచిపూడి రోడ్డు



ఇరుపక్కల మట్టి పోయకపోవడంతో కుంగుతున్న రోడ్డు

కోదాడరూరల్ : రోడ్డు నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో నిర్మించిన ఆరు నెలలకే ధ్వంసమవుతున్నాయి. ఐదు సంవత్సరాల పాటు చెక్కు చెదరకుండా ఉండాల్సిన రోడ్లు గుంతలమయంగా మారుతున్నాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని తొగర్రాయి సబ్‌స్టేషన్ నుంచి కూచిపూడి వరకు గల 5.2 కిలోమీటర్ల రోడ్డును రూ.1.80 కోట్ల వ్యయంతో ఆరు నెలల క్రితం నిర్మించారు. ఈ రహదారి గుండా కోదాడ మండలంలోని పలు గ్రామాల ప్రజలతో పాటు మేళ్లచెరువు, పక్కనే ఉన్న ఏపీలోని జగ్గయ్యపేట మండలాలకు చెందిన పలు గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు కొనసాగిస్తుంటారు. పలు చోట్ల రోడ్డు ధ్వంసం కావడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా చెక్ పోస్ట్‌ను తప్పించుకునేందుకు కొన్ని భారీ వాహనాలు కూడా ఈ రోడ్డు మార్గంలో వెళ్తున్నాయని, వాటిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మట్టి పోయడం మరిచిన కాంట్రాక్టర్

రోడ్డు నిర్మించిన కాంట్రాక్టర్ రోడ్డుకు ఇరుపక్కల మట్టి కూడా పూర్తిస్థాయిలో పోయలేదని వాహనదారులు అంటున్నారు. దీంతో ఎదురెదురుగా భారీ వాహనాలు వచ్చినపుడు రోడ్డు దిగాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎనిమిదేళ్ల తర్వాత ఈ రోడ్డు నిర్మాణానికి మోక్షం కలిగిందని, ఈ రోడ్డు పూర్తిగా ధ్వంసం కాకముందే ధ్వంసమైన చోట మరమ్మతులు చేసి ఇరుపక్కల మట్టి పోయాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేయిస్తాం

ఇటీవల నిర్మించిన తొగర్రాయి నుంచి కూచిపూడి రోడ్డుపై కొన్ని చోట్ల గుంతలు పడ్డాయి. కాంట్రాక్టర్‌తో మాట్లాడి ధ్వంసమైన చోట రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయిస్తాం. రోడ్డుకు ఇరుపక్కల మట్టి పోయిస్తాం.
– సత్యనారాయణ, ఆర్‌అండ్‌బీ ఏఈ, కోదాడ

మఠంపల్లి సర్పంచ్ చెక్ పవర్ రద్దు

- రూ.74, 84,826 నిధుల రికవరీకి కలెక్టర్ ఆదేశాలు

మఠంపల్లి : మఠంపల్లి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మన్నెం శ్రీనివాసరెడ్డి చెక్ పవర్‌ను రద్దు చేస్తూ జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీఓ మామిడి జానకిరాములు తెలిపారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మఠంపల్లి గ్రామ పంచాయతీలో రూ.74,84,826ల నిధులను అక్రమంగా డ్రా చేశారనే ఆరోపణలు రావడంతో ఇటీవల జిల్లా కలెక్టర్ సర్పంచ్‌కు నోటీసులు జారీ చేశారు. ఆ నోటీసులకు సదరు సర్పంచ్ ఇచ్చిన వివరణతో సంతృప్తి చెందని కలెక్టర్ రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం నిధులను 45 రోజుల లోపు రికవరీ చేయాలని స్థానిక తహసీల్దార్‌ను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. మండల పంచాయతీ అధికారి ఆంజనేయులుతో పాటు స్థానిక ఉప సర్పంచ్ జాల కిరణ్‌యాదవ్‌లకు జాయింట్ చెక్‌పవర్ ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీఓ అంజనేయులు తదితరులు ఉన్నారు.

గంజాయి వినియోగిస్తే కఠిన చర్యలు

- డీఎస్పీ ప్రకాష్‌యాదవ్



జానకీనగర్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రకాష్‌యాదవ్

చిలుకూరు : గంజాయి కొనుగోలు చేసినా, వినియోగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కోదాడ డీఎస్పీ ప్రకాష్‌యాదవ్ హెచ్చరించారు. మంగళవారం చిలుకూరు మండలం జానకీనగర్‌లో చిలుకూరు మండల పోలీసు శాఖ ఆధ్వర్యంలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని అన్నారు. మత్తు పదార్థాల పట్ల యువతతో పాటు, తల్లిదండ్రులు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో చిలుకూరు, కోదాడ టౌన్ ఎస్‌ఐలు చల్లా శ్రీనివాస్‌యాదవ్, రామాంజనేయులు, ఏఎస్‌ఐ పులి వెంకటేశ్వర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మామిడి రైతులను ఆదుకోవాలి



రామాపురంలో మామిడి తోటను పరిశీలిస్తున్న వీరాంజనేయులు, రైతులు

నడిగూడెం : మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం నాయకుడు ఏనుగుల వీరాంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని రామాపురంలో పలువురు రైతులకు చెందిన పూత, కాత రాని మామిడి తోటలను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో మామిడి తోటలు అధికంగా ఉన్నాయని తెలిపారు. మామిడి తోటలకు గత నవంబర్, డిసెంబర్ నెలల్లో రావాల్సిన పూత జనవరి నెల పూర్తి కావస్తున్నా రాలేదన్నారు. వేల రూపాయల పెట్టుబడులు పెట్టి అనేక రకాల మందులను పిచికారీ చేసినా ఫలితం లేదన్నారు. సంబంధిత అధికారులు తోటలను పరిశీలించి రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట మామిడి రైతులు ఉన్నారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గూడెపు శ్రీనివాస్

హుజూర్‌నగర్‌రూరల్ : గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ అన్నారు. బ్లాక్ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్ (బీపీడీపీ) 2024– 25 సంవత్సరానికి గాను ప్రణాళిక రూపొందించుటకు గాను మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గతంలో పనిచేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు చెల్లింపునకు ఎంపీటీసీలతో కలిసి తీర్మాణించడం జరిగిందన్నారు. సమావేశంలో ఎంపీడీఓ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

మతతత్వ విధానాలను ప్రతిఘటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు గురవయ్య

హుజూర్‌నగర్ : కేంద్ర ప్రభుత్వ మతతత్వ విధానాలను ప్రతిఘటించాలని ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు గురవయ్య అన్నారు. హుజూర్‌నగర్‌లోని ఇందిరా భవన్‌లో నిర్వహించిన ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదేళ్లు అవుతున్నా రైతాంగ, కార్మిక, ప్రజల సమస్యలను పరిష్కరించలేదని, అచ్ఛే దిన్, ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఇండియా వంటి మోసపూరిత నినాదాలు చేస్తూ ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. ఆల్ ట్రేడ్ యూనియన్ల పిలుపు మేరకు కార్పొరేట్, మతతత్వ విధానాలను ప్రతిఘటిస్తూ మోదీ ప్రభుత్వ వైఫల్యాలపై చార్జ్ షీట్ ప్రకటిద్దామని అన్నారు. ఫిబ్రవరి 16న దేశవ్యాప్త గ్రామీణ భారత్ బంద్ (కార్మికుల సమ్మె)ను జయప్రదం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడు మేళ్లచెరువు ముక్కంటి జిల్లా నాయకులు వల్లపుదాసు రాజు, చింతకాయల రాము, నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు చప్పిడి సావిత్రి, మండల అధ్యక్షురాలు గడ్డం వెంకటమ్మ, నాయకులు జాన్‌సైదా, కంటు వినోద్, తోట వీరబాబు, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

నిత్య సాధనతో గణితంపై పట్టు



చిలుకూరు : ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న హెచ్‌ఎమ్‌లు



నేరేడుచర్ల : విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న హెచ్‌ఎం బట్టు మధు

మోతె : నిత్య సాధనతో గణితంపై పట్టు సాధించవచ్చని మోతె మండల విద్యాధికారి కె.గోపాల్‌రావు అన్నారు. మంగళవారం మోతె మండల పరిధిలోని సిరికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో విద్యార్థులకు నిర్వహించిన గణిత పోటీ పరీక్షలో విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం ఆనందకిషోర్, గణిత ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి దామళ్ల కోటేశ్వరరావు, లిక్కి రామారావు, సుధీర్, ఉపాధ్యాయులు కొత్తపెల్లి రామంరెడ్డి, రజిని పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేత

చిలుకూరు : గణిత మాంత్రికుడు శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో మండల స్థాయిలో నిర్వహించిన గణిత పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మంగళవారం చిలుకూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంగ్లీష్ మీడియంలో ప్రథమ, ద్వితీయ స్థానాలను చిలుకూరు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ముక్కా చరణ్‌సాయిగౌడ్, పరిమళ, తెలుగు మీడియంలో ప్రథమ బహుమతి రామాపురం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన వైష్ణవి, ద్వితీయ బహుమతి ఆచార్యులగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన రమ్య దక్కించుకున్నట్లు తెలిపారు. ఈ విద్యార్థులకు ఈ నెల 27వ తేదీన జిల్లా స్థాయిలో పరీక్ష ఉంటుందని తెలిపారు. హెచ్‌ఎమ్ తేజోరాం, ఉపాధ్యాయులు రాంరెడ్డి, జనార్దన్, రామ్‌మోహన్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, రవికుమార్, జానిమియా పాల్గొన్నారు.

గణిత పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


నేరేడుచర్ల : నేరేడుచర్ల లయన్స్ క్లబ్, తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన మండల స్థాయి గణిత పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మంగళవారం హెచ్‌ఎం బట్టు మధు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి ప్రశంసాపత్రాలు, పరీక్ష ప్యాడ్లు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, మాతంగి సైదులు, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్‌రావు, నర్సింహారావు, నర్సకుమారి, భవాని, మాధవి, అశోక్, సురేందర్ ఉన్నారు.

బీసీ గురుకుల పాఠశాలలో..

నేరేడుచర్లలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల బాలుర పాఠశాలలో నిర్వహించిన గణిత పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మంగళవారం ప్రిన్సిపాల్ వెంకటప్పయ్య ప్యాడ్లు అందజేశారు. ఉపాధ్యాయులు వెంకన్న, శ్రీనివాస్ ఉన్నారు.

మునగాల జెడ్పీహెచ్‌ఎస్‌లో..

మునగాల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ మ్యాథ్స్ ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం మండల స్థాయిలో గణితంపై నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం దండు సీతారామరాజు ప్రశంసాపత్రాలు అందజేశారు. పోటీల్లో ఇంగ్లీష్ మీడియంలో ప్రథమ బహుమతిని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి బి.రామ్‌చరణ్, ద్వితీయ బహుమతిని స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థిని టి.మనుగీత, తెలుగు మీడియంలో ప్రథమ బహుమతి ముకుందాపురం జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి బి.నాగచరణ్, ద్వితీయ ముకుందాపురం జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి టి.విజయ్‌కుమార్ గెలుపొందినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉపాధ్యాయులు ఎర్ర అంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మునగాల : ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు సీతారామరాజు

సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళి



గరిడేపల్లి : పొనుగోడులో సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న స్ఫూర్తి యువజన సంఘం నాయకులు



హుజూర్‌నగర్ : ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కోదాడఅర్బన్ : యువత నేతాజీని ఆదర్శంగా తీసుకోవాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు ఆర్.సీతారామయ్య అన్నారు. కోదాడలోని విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127వ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కోదాడ యూనిట్ అధ్యక్షుడు వేనేపల్లి శ్రీనివాసరావు, జిల్లా, కోదాడ యూనిట్ నాయకులు రాంబాబు, విద్యాసాగర్‌రావు, వెంకటేశ్వరరావు, లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మరణం లేని యోధుడు సుభాష్ చంద్రబోస్

గరిడేపల్లి : మరణం లేని యోధుడు సుభాష్ చంద్రబోస్ అని స్ఫూర్తి యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అనంతు కరుణాకర్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని పొనుగోడు గ్రామంలో స్ఫూర్తి యువజన సంఘం ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చామకూరి అంజి, భాగ్యారావు, అనంతు బాలసైదులు, ప్రసాద్, సైదులు, వీరబాబు, మధు, అనంతు నవీన్, మల్లయ్య, సాయితేజ, శివప్రసాద్, కుర్రి శివ, నాగులురామ్, శోభన్‌బాబు, నాగరాజు, పీటర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

హుజూర్‌నగర్ : బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన ధీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని మంగళవారం హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జయవాణిదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

నేరేడుచర్ల : స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127వ జయంతిని మంగళవారం నేరేడుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సకుమారి, పద్మావతి, సైదులు, వెంకటేశ్వర్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, నర్సింహారావు, మాధవి, అన్నపూర్ణ, భవాని, శ్రవంతి, రవి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణప్రసాద్, కల్పన, నగేష్, రాజ్ సహాయక్, సరస్వతి తదితరులు ఉన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

నేరేడుచర్లలో సీపీఐ ఆధ్వర్యంలో నేతాజీ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ధనుంజయనాయుడు, మండల కార్యదర్శి ఎల్లబోయిన సింహాద్రి, కత్తి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సత్యం, శ్రీను, లక్ష్మి, నర్సమ్మ ఉన్నారు.



నేరేడుచర్ల : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..



కోదాడఅర్బన్ : రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవన్‌లో..

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోదాడరూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను కోదాడ రూరల్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. అనుమతి లేకుండా కోదాడ మండలంలోని మంగళితండా వద్ద గల పాలేరు వాగు నుంచి ఇసుకను ట్రాక్టర్‌లో కోదాడకు తరలిస్తుండగా చిమిర్యాల శివారులో పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు.

టిప్పర్ సీజ్..

మేళ్లచెరువు: అనుమతులు లేకుండా ఆంధ్రప్రదేశ్ నుంచి మేళ్లచెరువు మండల కేంద్రానికి ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను సోమవారం రాత్రి సీజ్ చేసినట్లు ఎస్‌ఐ సురేష్‌యాదవ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సోమవారం రాత్రి రేవూరు రోడ్డులో ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకొని సీజ్ చేసి డ్రైవర్ రాంబాబు, ఓనర్ లంకెల శ్రీనివాసరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మేళ్లచెరువు శివాలయం చైర్మన్ రాజీనామా

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వరస్వామి దేవాలయ కమిటీ చైర్మన్ వర్రా వెంకటరెడ్డి మంగళవారం తన పదవికి రాజీనామా చేశారు. ఈమేరకు రాజీనామా పత్రాన్ని దేవాలయ ఈఓ కొండారెడ్డికి అందించినట్లు ఆయన తెలిపారు.

గ్రాహం స్టేయిన్ సేవలు మరువలేనివి

భానుపురి : కుష్టువ్యాధిగ్రస్తులకు గ్రాహం స్టేయిన్ చేసిన సేవలు మరువలేనివని సూర్యాపేట జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దుర్గం ప్రభాకర్ అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని మన్నా చర్చిలో గ్రాహం స్టేయిన్ 25వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేయిన్, ఆయన కుమారులు ఫిలిప్, తిమోతిల చిత్రపటాలకు నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు సీహెచ్. సాల్మన్ రాజు, గౌరవ సలహాదారులు పి.మార్క్, యం.హోజర్య, ఆర్.రూబెన్, నియోజకవర్గ అధ్యక్షుడు బొక్క ఏలీయా రాజు, టౌన్ ఫెలోషిప్ వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లు జాన్‌పాల్, ట్రెజరర్ ఆర్. స్వర్జన్‌రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ వి.ఫిలిఫ్ తదితరులు ఉన్నారు.

నేడు మున్సిపల్ వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసం

- హుజూర్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి
- నేరుగా సమావేశానికి హాజరుకానున్న 18 మంది కౌన్సిలర్లు

ప్రస్తుతం పార్టీల వారీగా బలాబలాలు ...	
కాంగ్రెస్ కౌన్సిలర్లు	18
ఎక్స్ అఫీషియో సభ్యుడు	01 (మంత్రి ఉత్తమ్)
బీఆర్ఎస్ కౌన్సిలర్లు	09
సీపీఎం కౌన్సిలర్	01 (కాంగ్రెస్‌కు మద్దతు)

హుజూర్‌నగర్ : హుజూర్ నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావుపై అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధమైంది. ఈనెల 24న అవిశ్వాస తీర్మానంపై సమావేశం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మున్సిపాలిటీలో 18 మంది కౌన్సిలర్లు వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ గతనెల 30న కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. దానిని కలెక్టర్ జనవరి 3న పరిగణనలోకి తీసుకుని కౌన్సిలర్లకు ఫారం 2 నోటీసులు జారీ చేశారు. అవిశ్వాస సమావేశాన్ని జనవరి 24న నిర్వహించాలని దానికి ఆర్‌డీఓ జగదీశ్వర్ రెడ్డిని ప్రిసైడింగ్ అధికారిగా నియమిస్తూ కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

క్యాంప్‌కు తరలిన మున్సిపల్ కౌన్సిలర్లు

హుజూర్‌నగర్ మున్సిపాలిటీలో మొత్తం 28 మంది కౌన్సిలర్లు ఉండగా వారిలో చైర్ పర్సన్‌తో సహా 18 మంది కౌన్సిలర్లు మున్సిపల్ వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటించారు. వారికి మరో ముగ్గురు బీఆర్ఎస్ సభ్యులు కూడా మద్దతు తెలుపుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో 3వ వార్డు కౌన్సిలర్ కోతి సంపత్ రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిలర్లు, మహిళా కౌన్సిలర్ల భర్తలు కలిసి క్యాంప్‌కు తరలి వెళ్లారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఐతవరంలో గల సత్తెమ్మ ఆలయంలో మొక్కు చెల్లించుకున్నారు. అక్కడి నుంచి విజయవాడ సమీపంలోని ఐలాండ్‌లో రెండు రోజులుగా బస చేశారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం జరిగే అవిశ్వాస సమావేశానికి నేరుగా హాజరు కానున్నారు.



హుజూర్‌నగర్ : క్యాంప్‌లో ఉన్న మున్సిపల్ కౌన్సిలర్లు

మట్టపల్లిలో నృసింహుని నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మఠంపల్లి మండలం మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం పూర్తిగావించారు. స్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుఫర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో కల్యాణతంతు ముగించారు. క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకుల పూజలు ప్రత్యేక అర్చనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు భక్తులు పాల్గొన్నారు.